క్లుప్తంగా

చెట్టుకు రాఖీ కట్టిన చిన్నారులు



సంతపాలెం పాఠశాల ఆవరణలో చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

ఆరిలోవ: రాఖీ పండగ రాగానే ఆడ పిల్లలు ఇంట్లో అన్నయ్య, తమ్ముడికి రాఖీలు కట్టి సరదాగా గడుపుతారు. అన్నదమ్ములను ప్రేమించనట్లే కొందరు పిల్లలు పచ్చని చెట్లను కూడా ప్రేమించి ఎకో ఫ్రెండ్లీని చాటుతున్నారు. ఇందులో భాగంగా శనివారం 12వ వార్డు సంతపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఓ చెట్టుకు విద్యార్థులు రాఖీ కట్టి సోదర భావం చూపారు. వారిని ప్రాధానోపాధ్యాయుడు సిరికి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. పర్యావరణంపై ప్రేమ చూపాలని పిల్లలకు సూచించారు.

ఆదర్శ కమ్యూనిస్ట్ కుంచం రమణమ్మ



మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

మద్దిలపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో, నిజాయితీగా పనిచేసి ఆదర్శ కమ్యూనిస్ట్‌గా కుంచం రమణమ్మ అందరి హృదయాల్లో నిలిచారని సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. రమణమ్మ 4వ వర్ధంతి సభను శనివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణమ్మ పోరాటలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో బేగం, పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, కడియం కుమారి, అప్పారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ అధికారికి సత్కారం



ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ప్రతాప్‌ను సత్కరిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపక బృందం

మద్దిలపాలెం: జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) జిల్లా ఉత్తమ అధికారిగా ఆగస్టు 15న డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు జి.వి.ప్రతాప్ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపక బృందం ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

వృద్ధుడికి ఆశ్రయం

అల్లిపురం: భార్య చనిపోయిన తర్వాత ముగ్గురు కూతుళ్లున్నా పట్టించుకోకపోవడంతో ఒక తండ్రి రోడ్డున పడ్డాడు. బి.సత్యనారాయణ అనే 74 ఏళ్ల వృద్ధుడు నడవలేని స్థితిలో ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఉండగా.. టూటౌన్ పోలీసులు అతడిని గుర్తించి ఏయూటీడీ భీమ్‌నగర్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు.

పోషకాహారంతో మధుమేహం నియంత్రణ

బీచ్‌రోడ్డు: పోషకాహారం తీసుకోవడం వల్ల మధుమేహాన్ని నియంత్రించవచ్చని న్యూట్రిషినిస్ట్ షీలా కృష్ణస్వామి తెలిపారు. శనివారం ఓ హోటల్‌లో జరిగిన పోషకాహార విలువలు సదస్సులో ఆమె మాట్లాడుతూ రోజువారీ ఆహారంలో బాదం వంటి పోషక పదార్థాన్ని చేర్చడం ద్వారా ఉపయుక్తమవుతుందన్నారు. పోషకాలగని బాదం అని, రక్తంలో చక్కెర స్థాయిని, తక్కువ మొత్తం కొలెస్ట్రాల్‌ను నిర్వహించడంలో సహాయపడుతుందని వివరించారు. బాదం పప్పులు, తాజా పండ్లు మొదలైన సహజమైన, ఆరోగ్యకరమైన ఆహారాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

నెరవేరని లక్ష్యం



హాస్టల్ ఆవరణలో దట్టమైన పిచ్చి మొక్కలు

- నిరుపయోగంగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్
- ప్రారంభమైన కొద్ది నెలలకే మూసివేత
- పిచ్చి మొక్కలతో నిండిన వసతి గృహం పరిసరాలు

నగరంలో ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకునే మహిళలకు వసతి సౌకర్యం కల్పించి పటిష్టమైన భద్రత ఇవ్వాలనే ఆలోచనతో అధికారులు నిర్మించిన వసతి గృహం నిరుపయోగమవుతోంది. రూ.కోట్లు ఖర్చు చేసి హాస్టల్‌ను నిర్మించినప్పటికీ లక్ష్యం నెరవేరలేదు. చివరికి ఆ భవంతి ఎవరికీ ఉపయోగపడకుండా పిచ్చి మొక్కలకు ఆవాసంగా మారింది.



పైనాపిల్ కాలనీ మహిళా కేంద్రం స్థలంలో నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

ఆరిలోవ: ప్రశాంతమైన వాతావరణంలో పైనాపిల్ కాలనీ వద్ద దుర్గాభాయి దేశ్‌ముఖ్ జిల్లా మహిళా కేంద్రంలో సుమారు ఏడేళ్ల కిందట స్త్రీ, శిశు సంక్షేమ విభాగం అధికారులు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను నిర్మించారు. మహిళా కేంద్రానికి చెందిన స్థలంలోనే అరెకరం విస్తీర్ణంలో విశాలమైన బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని దీన్ని రూ.2 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. ఈ హాస్టల్‌లో 100 మంది మహిళలు ఉండటానికి వీలుగా వసతులు కల్పించారు. నిర్మాణం పూర్తవగానే దీని ఉపయోగంపై ప్రచారం చేపట్టారు. మొదట్లో కొందరు మహిళలు ఇక్కడ వసతి తీసుకొని ఉండేవారు. హాస్టల్ ప్రారంభమైన కొద్ది నెలలకే మూతపడింది. దీంతో సుమారు ఆరేళ్లుగా ఈ వసతి గృహం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం స్వధార్ గృహంలో ఉండే నలుగురు ఒంటరి మహిళలను మాత్రమే ఇక్కడ ఉంచుతున్నారు.

మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం..

ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ దూర ప్రాంతాల నుంచి నగరానికి బదిలీపై వచ్చిన మహిళా ఉద్యోగులు, కొత్తగా ఉద్యోగంలో చేరిన దూర ప్రాంత మహిళలకు ఇటువంటి హాస్టళ్లు అవసరమే. దీన్ని దృష్టిలో పెట్టుకుని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఇక్కడ మహిళా ప్రాంగణంలో 100 మంది సామర్థ్యం గల వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రుషికొండలోని ఐటీ సెజ్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులు, ఆరిలోవ ప్రాంతం హెల్త్‌సిటీ, విమ్స్‌లో పనిచేసే నర్సింగ్, ఇతర మహిళా సిబ్బంది, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పనిచేయడానికి వచ్చిన వారు, తదితర విభాగాల్లో పనిచేస్తున్న మహిళలకు ఇది అందుబాటులో ఉంటుందనే ఆలోచనతో ఇక్కడ నిర్మించారు.

రాత్రిళ్లు ప్రయాణ సమస్య..

ఈ హాస్టల్‌లో ఉండే మహిళలు కొంత అద్దె(నామినల్‌గా) చెల్లించుకోవాలి. ఎక్కడో అద్దెకు ఇళ్లు దొరికే వరకు కొందరు, మహిళలకు ఇక్కడే రక్షణ ఉంటుందనుకునే వారు ఇంకొందరు ఇందులో వసతి సౌకర్యం పొందేవారు. అంతవరకూ బాగానే ఉంది. హనుమంతవాక నుంచి పైనాపిల్ కాలనీకి ఏడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడ నుంచి బీఆర్‌టీఎస్ రహదారిలో సింహాచలం వైపు వెళ్లే బస్సులు, ఆటోలు ఆగుతాయి. రాత్రి వేళలో ఈ మార్గంలో రాకపోకలు తక్కువగా ఉంటాయి. ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తుండే మహిళలు తిరిగి సాయంత్రం 7 గంటల తర్వాత వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు చేరడానికి ప్రయాణ సౌకర్యం కష్టంగా మారింది. హాస్టల్‌లో వసతి సౌకర్యాలు బాగున్నప్పటికీ మహిళలు ఉండటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో హాస్టల్‌లో ఎవ్వరూ చేరకపోవడంతో ఖాళీగా మిగిలింది. ప్రత్యేక రవాణా సదుపాయం ఉంటేనే ఇది మళ్లీ ఉపయోగంలోకి వస్తుందని పలువురు భావిస్తున్నారు.

ఆవరణలో పిచ్చి మొక్కలే..

ప్రస్తుతం వర్కింగ్ ఉమెన్స్ ఎవరూ ఇక్కడ ఉండటం లేదు. ఖాళీగా ఉన్న ఈ హాస్టల్ ఆవరణ దట్టమైన పిచ్చి మొక్కలతో నిండిపోయింది. వాటిలో పాములు చేరడంతోపాటు ఆవరణంతా అస్తవ్యస్తంగా మారింది. నిత్యం పరిశుభ్రంగా ఉండాల్సిన వసతి గృహం పరిసరాలు చిట్టడవిని తలపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. హాస్టల్ భవంతిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

భగ్గుమన్న వైద్య లోకం



విమ్స్ వద్ద నిరసనలో వైద్యులు, సిబ్బంది



శ్రీకృష్ణాపురం బీఆర్‌టీఎస్‌పై మానవ హారంలో యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది



హెల్త్‌సిటీలో ర్యాలీ చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది



ఫిషర్‌మెన్ కాలనీలో ర్యాలీ చేస్తున్న యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది

ఆరిలోవ: కోల్‌కతాలో పీజీ ట్రైనీ డాక్టర్ హత్యా ఘటనపై శనివారం పలు చోట్ల వైద్యులు నిరసనలు తెలిపారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఇక్కడ ఓపీ నుంచి జాతీయ రహదారిపై ప్రధాన ద్వారం వరకు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆస్పత్రి నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు ర్యాలీ చేసి అక్కడ మానవ హారం నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. హెల్త్‌సిటీలో రెయింబో, పినాకిల్, మెడికవర్, ఒమేగా, శుశ్రుత, క్యూ1, మెడిసీ, కేర్ తదితర ఆస్పత్రుల ఆధ్వర్యంలో వందల మంది వైద్యులు, సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. హెల్త్‌సిటీలోని అన్ని రోడ్లతోపాటు బీఆర్‌టీఎస్‌లో చినగదిలి షిర్డీసాయిబాబా మందిరం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవ హారం నిర్వహించి జూనియర్ వైద్యురాలి హత్యకు కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని నినాదాలతో హోరెత్తించారు. వైద్య సిబ్బంది గంటల తరబడి చేపట్టిన నిరసనల కారణంగా ఆస్పత్రుల్లో వైద్య సేవలు మందగించాయి. రోగులు కొంతసేపు ఇబ్బంది పడ్డారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎంవీపీకాలనీ: ఫిషర్‌మెన్ కాలనీ యూపీహెచ్‌సీ వైద్య ఉద్యోగులు కోల్‌కతా ట్రైనీ డాక్టర్ మృతిపై నిరసన తెలుపుతూ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని, ట్రైనీ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ పద్మావతి, సీహెచ్‌వో తవిటమ్మ, ఆశా వర్కర్ పార్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగరతీరంలో కొవ్వొత్తుల ర్యాలీ



సాగరతీరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, బీజేపీ నాయకులు

బీచ్‌రోడ్డు: కోల్‌కతాలోని ఆర్జే కర్ హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార సంఘటనకు నిరసనగా బీజేపీ మహిళా మోర్చా, ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో శనివారం సాగరతీరంలో మౌన ప్రదర్శన క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కాళీమాత టెంపుల్ నుంచి వైఎంసీఏ వరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ఎన్ని చట్టాలు చేసినా.. సమాజంలో మార్పు రావడం లేదని, ఇటువంటి వారికి బహిరంగంగా శిక్షపడేలా చట్టం చేయాలన్నారు. ఈ ఘటనపై న్యాయం జరిగే వరకూ దేశవ్యాప్తంగా నిరసన చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, మెడికల్ కాలేజ్ డాక్టర్ అప్పారావు, ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్, బీజేపీ మెడికల్ రాష్ట్ర కన్వీనర్ రవికుమార్, బీజేపీ కో కన్వీనర్ బెహరా రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో తగ్గిన వైద్య సేవలు



ఖాళీగా ఉన్న విమ్స్ ఓపీ

ఆరిలోవ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అమానుష దాడిని వైద్యులు ఖండిస్తున్నారు. ఈ సంఘటనపై నగరంలో అంతటా వైద్యులు సంఘీభావం తెలుపుతున్నారు. ఇందులో భాగంగా శనివారం విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొంతసేపు నిరసన తెలిపారు. ఓపీ నుంచి జాతీయ రహదారి వైపు ప్రధాన ద్వారం వరకు ర్యాలీ చేపట్టి నినాదాలు చేశారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులు కొందరు తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. దీంతో పాటు ముందుస్తుగా వైద్యులు వైద్య సేవలు బంద్ చేస్తున్నారని తెలియడంతో ఇంకొందరు రోగుల రావడం మానేశారు. దీంతో రోగులు లేక విమ్స్ బోసిపోయింది. ఓపీ, కన్సల్టెన్సీ గదులు ఖాళీగా మిగిలాయి. నిరసన కార్యక్రమం ముగిసిన అనంతరం విమ్స్‌కు వచ్చిన అరకొర రోగులకు వైద్య సేవలు అందించారు.

విషాదం నింపిన.. పోలీసుల నిర్లక్ష్యం!

- సెల్ఫ్ యాక్సిడెంట్ ఘటనలో వ్యక్తి మృతి
- కుటుంబ సభ్యులకు కనీస సమాచారమివ్వని ఎంవీపీ పోలీసులు



యింటి వీరవెంకట సత్యనారాయణ(ఫైల్)

ఎంవీపీకాలనీ: యింటి వీర వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి సెల్ఫ్ యాక్సిడెంట్ ఘటనలో ఎంవీపీ పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యాక్సిడెంట్ అనంతరం కోమాలోకి వెళ్లిన సత్యనారాయణ రెండు రోజులుగా కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాడి శనివారం మృతి చెందాడు. దీనిపై అతడి కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఘటనకు సంబంధించి వివరాలిలా.. యింటి వీరవెంకట సత్యనారాయణ తగరపువలసలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి మద్దిలపాలెం కేఆర్‌ఎం కాలనీలో నివసిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి భార్య ఫోన్ చేసి వరలక్ష్మీ వ్రతం సామగ్రి కావాలని చెప్పడంతో.. సత్యనారాయణ 15వ తేదీ తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై మిత్రుడిని పెదవాల్తేర్‌లో దింపేసి శివాజీపాలెం మీదుగా ఇంటికి బయలు దేరాడు. అప్పటికే మద్యం తాగి ఉండటంతో శివాజీ పార్కు వద్ద సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యాడు. అటుగా వెళ్తున్న రాపిడో బాయ్ పోలీసులకు సమాచారమివ్వడంతో అక్కడికి చేరుకున్న ఎంవీపీ పోలీసులు కేజీహెచ్‌కు తరలించి చేతులు దులిపేసుకున్నారు. తీవ్రగాయాల పాలైన సత్యనారాయణ కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులకు కనీస సమాచారం అందించకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చినా..

తన భర్త కనిపించడం లేదంటూ సత్యనారాయణ భార్య ఈ నెల 16న ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కూడా నమోదు చేసిన పోలీసులు సత్యనారాయణ సెల్ఫ్ యాక్సిడెంట్‌పైనా, కేజీహెచ్‌లో కోమాలో ఉండటంపైనా ఆమెకు సమాచారం ఇవ్వకుండా అక్కడి నుంచి పంపించేశారు. సత్యనారాయణ కోసం గాలిస్తున్న కుటుంబ సభ్యులు ఎట్టకేలకు కేజీహెచ్‌లో అతడిని గుర్తించారు. రెండు రోజులుగా మృత్యువుతో పోరాడి చనిపోయినట్లు తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం సాయంత్రం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మృతుడి భార్య, కూతుళ్ల కన్నీటి పర్యంతమైన తీరు అందరినీ వేదనకు గురిచేసింది. పోలీసులు వ్యవహరించిన తీరు అమానవీయమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

మద్దిలపాలెం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం ఆయనను సిరిపురంలోని స్వగృహంలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. 20, 12 వార్డుల కార్పొరేటర్లు ముువ్వల లక్ష్మి, అక్కరమాని రోహిణి, పార్టీ సీనియర్ నాయకులు మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు, ముువ్వల సురేష్, పీతల గోవింద్, 16వ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, సంపంగి సురేష్ పాల్గొన్నారు.

కుళాయి నీరు రాక ఇక్కట్లు



నీటిధార చిన్నగా వస్తున్న కుళాయి వద్ద మహిళలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో వారం రోజులుగా కుళాయి నీరు సరఫరా అరకొరగా వస్తోంది. దీంతో కాలనీ మహిళలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. తాగునీటికి వినియోగించే కుళాయి నీరు రాకపోవడంతో బయట నీటిని కొనుక్కొని తాగావాల్సి వస్తోందని వాపోతున్నారు. గొల్లవీధిలో కుళాయిల నుంచి చుక్క నీరు రావడం లేదని మహిళలు మండిపడుతున్నారు. ఈ వీధిలో నూతనంగా వేసిన ఓపెన్ పైప్‌లైన్ కనెక్షన్ కలిపే ప్రక్రియలో భాగంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అంటున్నారు. ఈ పైప్‌లైన్ ఎగువ ప్రాంతంలో ఉన్న పైప్‌లైన్‌కు అనుసంధానం చేశారు. దిగువ ప్రాంతంలో ఉన్న వీధి శివారు కుళాయిలకు అనుసంధానం చేయలేదు. దీంతో మూడు రోజులుగా పూర్తిగా నీరు సరఫరా జరగడం లేదని మహిళలు చెబుతున్నారు. సన్నని ధార వస్తున్న కొన్ని కుళాయిల వద్ద బారులు తీరుతున్నామని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఏయూ వీసీ శశిభూషణ్‌రావును కలిసిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణ్‌రావును శనివారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అనేక విద్యా సంస్థల్లో కొంత మంది విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏయూలో సైకాలజీ, సోషల్ వర్క్, రీసెర్చ్ స్కాలర్స్‌ను విద్యా సంస్థలకు పంపించి పలు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం, మానసిక ఒత్తిడి, సైబర్ నేరాలు వంటి అంశాలపై విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. సోషల్ వర్క్ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలల విద్య, వైద్య, ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై పరిశోధన చేయించాలని కోరారు. ఆ నివేదిక ద్వారా కమిషన్ పరంగా బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు. తద్వారా సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు ముందుకు వేయడానికి కమిషన్‌కు అవకాశం ఉంటుందని చెప్పారు.

చెత్త కుప్పల తొలగింపు



చెత్త కుప్పలు తొలగించి శుభ్రం చేసిన రహదారి

సాక్షి ఎఫెక్ట్..

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట రజక వీధి గెడ్డలో పూడికలను తీసి రోడ్డుపై కుప్పలుగా వేయడంతో స్థానికులు, ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'చెత్త కుప్పలతో దుర్వాసన' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తక్షణం స్పందించారు. శనివారం ఉదయం హుటాహుటిన చెత్త కుప్పలను తొలగించారు. ఈ ప్రాంతంలో దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు



సెల్ టవర్ ఏర్పాటు చేసిన ఇంటి ముందు స్థానిక మహిళలు



ఆదర్శనగర్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్ టవర్

ఆరిలోవ: పాత డెయిరీఫారం ప్రాంతం ఆదర్శనగర్‌లోని ఓ ఇంటిపై సెల్ టవర్ ఏర్పాటు వివాదంగా మారింది. సెల్ టవర్ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ మాకొద్దంటూ వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ ఓ ఇంటిపైన ఎయిర్ టెల్ కంపెనీకి చెందిన సెల్ టవర్ ఏర్పాటు చేసుకోవడానికి ఇంటి యజమాని టవర్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో కొద్ది రోజులుగా టవర్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇంటిపైన సెల్ టవర్ ఏర్పాటు చేశారు. దానికి కేబుళ్లు ఆపరేటింగ్ సిస్టం అమర్చాల్సి ఉంది. దీంతో శనివారం స్థానికులు ఆ ఇంటి వద్దకు చేరుకుని సెల్ టవర్ నిర్మాణం పనులు నిలిపేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. సెల్ టవర్ వల్ల నివాసులు అనారోగ్యం పాలవుతామని, రేడియేషన్ సమస్యలకు గురవుతామన్నారు. గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు ఎక్కువగా దీని సమస్యతో అనారోగ్యానికి గురవుతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ టవర్ ఇక్కడ ఏర్పాటు చేయవద్దంటూ నినాదాలు చేశారు. పనులు వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానికులం అంతా కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఎంవీపీకాలనీ: చినవాల్తేర్ విద్యానగర్ కాలనీకి చెందిన కె.గోవిందరెడ్డి(51) అనే వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోవిందరెడ్డి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో శివాజీపాలెంలోని అత్తారింటికి వెళ్లాడు. రాత్రి 11.30 గంటల సమయంలో గోవిందరెడ్డి భార్య సరోజ చనిపోయి ఉన్న అతడిని తీసుకొని చినవాల్తేర్‌లోని అత్తింటికి వచ్చింది. దీంతో గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు ఆందోళన చెందడంతోపాటు అతడి శరీరంపై గాయాలు ఉండటంతో కావాలనే చంపేశారనే అనుమానం వ్యక్తం చేశారు. గోవిందరెడ్డి తండ్రి రాము ఫిర్యాదు చేయడంతో ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్దిలపాలెంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఎంవీపీకాలనీ: ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మద్దిలపాలెంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్న గుడ్ల సింహాచలం జీవీఎంసీ అధికారులు ప్లాస్టిక్ కవర్ల విక్రయం పేరుతో తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ శనివారం ఉదయం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం సింహాచలం చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులను వివరణ కోరగా.. వారికి ఎలాంటి సమాచారం లేదని, ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

50 మంది రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న సంస్థ ఉద్యోగులు

బీచ్‌రోడ్డు: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా జెట్‌వెర్క్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 50 మంది రక్తదానం చేసినట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సలీం, సిద్ధార్థ్, నరేంద్ర, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.